సాక్షి
తిరుపతి
శనివారం : 23 : డిసెంబర్ : 2023



వెట్టిచాకిరీ
కోవనూరు హాస్టల్ విద్యార్థులతో స్థానిక టీడీపీ నేత వెట్టిచాకిరీ చేయిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. - 8లో



ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యం
ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యంగా సీఎం జగనన్న అడుగులు వేస్తున్నారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. - 8లో



వృత్తినైపుణ్యంతోనే..
మనం చేస్తున్న వృత్తిలో మంచి నైపుణ్యం సాధిస్తే ఉన్నత స్థాయికి ఎదగొచ్చని మంత్రి ఆర్కే రోజా తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. గురువారం అర్ధరాత్రి వరకు 59,868 మంది స్వామివారిని దర్శించుకోగా 23,935 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.91 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జీవకోనలోని విశ్వం పాఠశాల ఆవరణలో షిరిడీ సాయి స్కిల్ డెవెలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ ఉద్యోగ, ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవెలపర్, డొమస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, హోటల్ మేనేజ్‌మెంట్, నర్సింగ్, టైలరింగ్, బ్యూటీషియన్, ఎల్డర్లీ కేర్ టేకర్, అనిమల్ హెల్త్ వర్కర్ వంటి కోర్సుల్లో ప్రభుత్వ ఖర్చులతో ఉచితంగా శిక్షణ అందించనున్నారు. శిక్షణానంతరం సర్టిఫికెట్లు, అర్హత ఉన్న వారికి వివిధ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఇతర వివరాలకు 91777 26256, 96669 44795 నంబర్లలో సంప్రదించాలని ఆ సొసైటీ ఓ ప్రకటనలో తెలిపింది.

హక్కులపై అవగాహన అవసరం



సర్టిఫికెట్లు అందజేస్తున్న పార్థసారథి, డీఎస్‌వో

తిరుపతి అర్బన్: తమ హక్కులపై అందరికీ అవగాహన ఉండాలని జిల్లా వినియోగదారుల కమిషన్ ప్రెసిడెంట్ పార్థసారథి తెలిపారు. శుక్రవారం తిరుచానూరు జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ వారి ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం–2023వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచే వినియోగదారుల చట్టంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. జిల్లా పౌరసరఫరాల అధికారి రాజారఘువీర్ మాట్లాడుతూ వినియోగదారులు తమ హక్కులను కాపాడుకోవడంతో పాటు చట్టం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. కన్స్యూమర్ కమిషన్ సభ్యులు స్నేహలతా రెడ్డి, శశిధర్‌రెడ్డి, కన్స్యూమర్ మాస్టర్ ట్రైనర్ నీలకంఠ, జిల్లా కన్స్యూమర్ ఇన్ఫర్మేషన్ ఇన్‌చార్జి రాజారెడ్డి, ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ నారాయణమ్మ, డిప్యూటీ ఈఓ ఆనందరెడ్డి పాల్గొన్నారు.

వరసిద్ధుని దర్శనానికి 4 గంటలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. అయ్యప్ప మాలధారులతోపాటు పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలు నిండిపోయాయి. ఈ క్రమంలో గణనాథుని దర్శనానికి సుమారు 4 గంటల సమయం పడుతోంది. భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వైకుంఠ ద్వార దర్శనానికి ముస్తాబైన శ్రీవారి ఆలయం

కట్టెదుర వైకుంఠము

- తిరుమలలో శనివారం ఉదయత్పూర్వం నుంచి వైకుంఠ ద్వార దర్శనం
- తండోపతండాలుగా తరలివచ్చిన భక్తజనం
- మార్మోగుతున్న గోవిందనామస్మరణ

తిరుమల: వైకుంఠ ఏకాదశి పర్వదినానికి తిరుమల ముస్తాబైంది. శనివారం ఉదయత్పూర్వం నుంచి వైకుంఠ ద్వారం ద్వారా భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కలగనుంది. ఈనెల 23 నుంచి వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనం ఉంటుంది. ఈమేరకు టీటీడీ ఏర్పాట్లు పూర్తిచేసింది. శ్రీవారి ఆలయంలో 2020కి ముందు వరకు వైకుంఠ ద్వారాన్ని రెండు రోజులపాటు తెరిచి ఉంచేవారు. ఆ తర్వాత నుంచి పది రోజుల పాటు వైకుంఠ ద్వార



హరి నిలయంలో కరిరాజు రాజసం

దర్శనాన్ని కల్పించేలా టీటీడీ చర్యలు చేపట్టింది.

వైకుంఠ ఏకాదశి ప్రాధాన్యత

వేంకటాచల మహత్యంలో దేవతలకు ఉత్తరాయణంలో వచ్చే 6 నెలల కాలాన్ని పగలుగా, దక్షిణాయణంలో వచ్చే 6 నెలల కాలాన్ని రాత్రిగా పేర్కొంటారు. దక్షిణాయణంలో చివరి నెల ధనుర్మాసాన్ని దేవతల నెలగా భావిస్తారు. అదే సమయంలో ముక్కోటి దేవతలు మహావిష్ణువుని దర్శించుకుంటారు. విష్ణువుకు తిథులలో ఏకాదశి, ద్వాదశి అతిముఖ్యమైనవి. వైకుంఠ ఏకాదశి నుంచి వైష్ణవ ఆలయాలలో దేవతల ద్వారంగా పేర్కొనే ఉత్తర ద్వారాన్ని తెరచి ఉంచుతారు. ఆ రోజున విష్ణువు ఉత్తరద్వారం వద్ద దేవతలకు దర్శన భాగ్యం కల్పిస్తారని ప్రతీతి.

నేడు స్వర్ణరథోత్సవం

శనివారం తెల్లవారుజామున వైకుంఠ ఏకాదశి, 24న వైకుంఠ ద్వాదశి పర్వదినాలు జరగనున్నాయి. ఈ మేరకు శనివారం ఉదయాత్పూర్వం తిరుప్పావైతో శ్రీవారిని మేల్కొలిపి ఏకాంతంగా ధనుర్మాస కైంకర్యాలు నిర్వహించనున్నారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు స్వర్ణరథంపై ఆలయ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ జరగనుంది. రాత్రి రంగనాయకుల మండపంలో అధ్యయనోత్సవ కార్యక్రమాలు చేపడతారు. ఈ నెల 24న వైకుంఠ ద్వాదశి పర్వదినాన స్వామి పుష్కరిణి తీర్థముక్కోటి తిరుమలలో జరగనుంది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.



విరుల విందులో రంగనాథుడు!



శంఖు, చక్రాలు.. అన్నమాచార్యులు



భక్తజన గోవిందం

పోటెత్తిన భక్తులు

- తిరుపతిలో 9 కేంద్రాల్లో వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ
- భక్తుల సౌకర్యార్థం టీటీడీ ప్రత్యేక వసతులు



ఇందిరామైదానంలో కిక్కిరిసిన క్యూలు



టోకెన్లు ఇస్తున్న సిబ్బంది

తిరుపతి (అలిపిరి): వైకుంఠ ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. తిరుపతిలో ఎక్కడ చూసినా గోవిందుని భక్తులే కనిపించారు. నగరంలో ఏర్పాటు చేసిన 9 కేంద్రాల్లో రద్దీ నెలకొంది. ఆయా కేంద్రాల్లో వైకుంఠ ద్వార దర్శనార్థం ఉచితంగా టోకెన్ల జారీని గురువారం అర్ధరాత్రి నుంచే ప్రారంభించారు. టోకెన్ల కోసం అధిక సంఖ్యలో భక్తులు కేంద్రాల వద్దకు తరలిరావడంతో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా టీటీడీ ముందస్తు ఏర్పాట్లు చేపట్టింది. మౌలిక వసతులతోపాటు ప్రత్యేక మెడికల్ క్యాంపులను సమకూర్చింది. రోజుకు 40 వేల చొప్పున 10 రోజుల పాటు దర్శనార్థం టోకెన్లను టీటీడీ పంపిణీ చేస్తోంది. శుక్రవారం రాత్రికి వైకుంఠ ద్వార దర్శనానికి 23 నుంచి 27వ తేదీ వరకు టోకెన్లను అందించారు. శనివారం 28వ తేదీకి సంబంధించిన టోకెన్లు ఇవ్వనున్నారు. రోజుకు 40 వేల టోకెన్ల చొప్పున సుమారు 1.6 లక్షల టోకెన్లను భక్తులకు అందించారు.

విద్యార్థులు మేధాశక్తిని పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



ప్రదర్శనను ఆసక్తిగా తిలకిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

- జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- పాల్గొన్న డీఈఓ శేఖర్

శ్రీకాళహస్తి: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులు తమలోని మేధాశక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వీ.శేఖర్ విచ్చేసి విద్యావైజ్ఞానిక ప్రాజెక్టులను వీక్షించారు. ఆయా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లల్లో మేధాశక్తిని గుర్తించి ప్రోత్సహించేందుకు సైన్స్‌ఫేర్ ఓ మంచి వేదికన్నారు. విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని దాని సాధనకు కృషి చేయాలని చెప్పారు. డీఈఓ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు ఉన్నం వాసు నాయుడు, ముత్యాల పార్థసారథి, శంకర్, మాధవయ్య, మధురెడ్డి, కొల్లూరు హరినాయుడు, పసల సుమతి పాల్గొన్నారు.

ఇల వైకుంఠం

- తుమ్మలగుంటలో వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం
- ఉట్టిపడుతున్న ఆధ్యాత్మిక వాతావరణం
- 5 వేల కిలోల పుష్పాలు, వెయ్యి కిలోల ఫలాలతో విశేష అలంకరణ
- ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: వైకుంఠ ఏకాదశికి తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయంలో 5 వేల కిలోల స్వదేశీ, విదేశీ పుష్పాలు, వెయ్యి కిలోల వివిధ రకాల పండ్లతో చేపట్టిన అలంకరణ ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఉట్టిపడేలా చేస్తోంది. తుమ్మలగుంట ప్రధాన మార్గం నుంచి ఆలయానికి చేరుకునే వరకు ఏర్పాటు చేసిన తోరణాలు, దేవతామూర్తుల విద్యుత్ కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. భక్తుల రద్దీకి తగినట్లు ఆలయం వద్ద పటిష్ట క్యూలైన్లు ఏర్పాటు చేశారు.



ఆలయం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తెల్లవారు జామున 4 గంటలకే..

ఆలయంలో శనివారం తెల్లవారు జామున 4 గంటలకు వైకుంఠ ద్వారం తెరుచుకోనుంది. ఈ మేరకు ఆలయం వద్ద ఏర్పాట్లను ప్రభుత్వ విప్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి , తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. తిరుపతి రూరల్ పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.

ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు

భక్తుల కోసం తెలుగుతల్లి విగ్రహం నుంచే వాహనాలకు అనుమతి లేకుండా చర్యలు తీసుకున్నారు. టీటీడీ డెయిరీ ఫామ్ ఆవరణలో వాహనాలు పార్క్ చేసేలా ఏర్పాట్లు చేపట్టారు. అలాగే జాతీయ రహదారిపై నుంచి ఆలయానికి వచ్చే వాహనాలను తుమ్మలగుంట చెరువు వద్ద పార్క్ చేసేలా పోలీసులు స్థలాలను సిద్ధం చేశారు. భక్తులు సహకరించాలని పోలీసు ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేశారు.



వైకుంఠ ద్వారం





ఆలయం లోపల విశేష పుష్పాలంకరణ

క్లుప్తంగా

రెజ్లింగ్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

నాయుడుపేట: పట్టణంలోని అంబేడ్కర్ బాలుర గురుకులంలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు అండర్–15 బాలబాలికల విభాగంలో తిరుపతి జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్లు కాకినాడలో ఈ నెల 23, 24 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొననున్నాయి. బాలికల జిల్లా జట్టుకు సుకన్య, నవ్య, సుమశ్రీ, ప్రత్యూష, నవ్య, హారిక, రేష్మ ఎంపికయ్యారు. బాలుర ఫ్రీస్టయిల్ విభాగంలో కే అవినాష్, చందు, కుమారస్వామి, వెంకటేష్, గణేష్, మదన్‌కుమార్, రో మన్ విభాగంలో సోము, నిహేష్, కార్తిక్, రోహిత్, ప్రతాప్, రామచంద్రన్, వెంకటరామ య్య ఎంపికయ్యారు. వీరిని కోచ్ ఉదయ్‌కుమార్, ప్రిన్సిపల్ మల్లికార్జున్‌రావు, వైస్ ప్రెసిడెంట్ రవిరెడ్డి, ధార రవి, పీడీ హరినారాయణ, భాస్కర్‌లు క్రీడాకారులను అభినందించారు.

హాస్టల్ విద్యార్థులతో వెట్టిచాకిరీ



టీడీపీ నేత ఇంటికి మొక్కలు మోసుకెళ్తున్న హాస్టల్ విద్యార్థులు

కేవీబీపురం: ఓ టీడీపీ నేత హాస్టల్ విద్యార్థులతో వెట్టిచాకిరీ చేయిస్తున్న ఘటన కేవీబీపురం మండలం, కోవనూరులో చోటు చేసుకుంది. వివరాలు.. కోవనూరులో ఎస్సీ, ఎస్టీ బాలుర వసతిగృహం ఉంది. ఈ హాస్టల్ పక్కనే నివాశం ఉంటున్న టీడీపీ నేత కిశోర్ రెడ్డి, అతని కుటుంబ సభ్యులు హాస్టల్ విద్యార్థులతో తమ సొంత పనులు చేయించుకుంటున్నారు. నాలుగేళ్లుగా ఇక్కడ ఇదే తంతు. టీడీపీ హయాంలో కిశోర్‌రెడ్డి కాంట్రాక్టర్‌గా వ్యవహరించారు. సుమారు రూ.3 కోట్ల ప్రభుత్వ నిధులతో ఇక్కడ సంక్షేమ హాస్టల్‌ను నిర్మించారు. ఆయన ఇంట్లో ఏవైనా నిర్మాణ పనులు, ఇతరత్రా పనులు జరిగితే అక్కడకు హాస్టల్ విద్యార్థులు వెళ్లి తమవంతు సేవలందించాల్సిందే. లేకుంటే బెదిరింపులకు దిగడం రివాజుగా మారుతోంది. ఈ విషయంపై స్థానిక వార్డెన్ సదాశివయ్యను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

జిల్లాలోని పడమటి మండలాల ప్రజల స్వప్నం సాకారమైంది.. హంద్రీ–నీవా కాలువ జలకళ సంతరించుకుంది.. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ పరుగులు తీస్తోంది.. పుంగనూరు నుంచి పలమనేరు దాటి కుప్పం దిశగా ఉరుకుతోంది.. కరువు నేల ఇకపై సస్యశ్యామలం కానుంది.. తాగునీటి కష్టాలకు సైతం చెక్ పడనుంది.. దశాబ్దాల ఆకాంక్ష నెరవేరిన క్రమంలో రైతాంగం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తోంది.. మాట చెల్లించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తోంది.. గతంలో చంద్రబాబు జల హారతి పేరిట మోసం చేశారని మండిపడుతోంది.. సాగును సంబరంగా మార్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తోంది.

హంద్రీ–నీవా కాలువ ద్వారా గంగవరం మండలంలో ప్రవహిస్తున్న కృష్ణాజలాలు (ఇన్‌సెట్) పుంగనూరు ఉపకాలువ నుంచి వస్తున్న నీరు



కరువు తీరేలా
కృష్ణమ్మ పరవళ్లు

- పలమనేరుకు చేరిన హంద్రీ–నీవా జలాలు
- మరో 20 రోజుల్లో కుప్పం చేరనున్న నీరు
- ఆనందోత్సాహాల్లో పడమటి మండలాల ప్రజలు
- ఇచ్చిన మాట నెరవేర్చిన ముఖ్యమంత్రిపై ప్రశంసలు
- గతంలో జలహారతి పేరిట మోసం చేసిన చంద్రబాబు
- సొంత నియోజకవర్గానికి సైతం మొండిచేయి
- నీరిచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్న రైతులు

పలమనేరు/ బైరెడ్డిపల్లి : జిల్లాలోని పడమటి ప్రాంతమైన కుప్పం, పలమనేరు ప్రజల దశాబ్దాల కలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాకారంచేసింది. హంద్రీ–నీవా పుంగనూరు ఉప కాలువ నుంచి కుప్పం ఉపకాలువకు మూడు రోజులుగా నీరు ప్రవహిస్తోంది. ప్రస్తుతం పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి, గంగవరం మండలాలను దాటి కృష్ణా జలాలు బైరెడ్డిపల్లె మండలంలోకి చేయారి. మరో ఇరవై రోజుల్లో కుప్పం నియోజకవర్గంలోని పరమసముద్రానికి చేరుకోనున్నాయి. ఈ క్రమంలో పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల ప్రజలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. హంద్రీ–నీవా కాలువలో బిరబిరా వస్తున్న కృష్ణా జలాలను చూసి రైతులు పులకరిస్తున్నారు. కరువు ప్రాంతంగా పేరుపొందిన పడమటి మండలాలు ఇకపై సస్యశ్యామలమవుతాయని సంతోషంగా చెబుతున్నారు. వ్యవసాయ బోర్లలో సైతం భూగర్భజలాలు పెరిగుతున్నాయని వెల్లడిస్తున్నారు.

కుప్పం ఉప కాలువ లక్ష్యం ఇదీ..

హంద్రీ–నీవా సుజల స్రవంతిలో భాగంగా రాయలసీమలోని 6,025 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీటిని అందించడమే ఈ పథకం లక్ష్యం. ఇందుకోసం కృష్ణా నదినుంచి 120 టీఎంసీల నీటిని ఇక్కడికి తరలించే పథకం ఇది. అందులో భాగమే కుప్పం, పుంగనూరు ఉప కాలువలు. పుంగనూరు ఉపకాలువ నుంచి 143.9 కిలోమీటర్ల మేర కుప్పం ఉపకాలువ ద్వారా పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని 8 మండలాలకు 4.02 లక్షల మంది దాహార్తిని తీరుస్తారు. 110 చెరువులను ఈ నీటితో నింపి సుమారు 6,300 ఎకరాలకు సాగునీరు అందిస్తారు. గతంలో రూ.460.81 కోట్లతో ఆర్‌కే హెచ్‌ఈఎస్ కోయ అనే సంస్థ పనులు ప్రారంభించింది. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ పనుల అంచనాను రూ.560.29 కోట్లకు పెంచింది. దీంతో కుప్పం ఉపకాలువ పనులు రూ.99.4 కోట్లతో ఆర్ ఆర్ కన్‌స్ట్రక్షన్స్ చేపట్టింది. ప్రస్తుతం రూ.65 కోట్ల దాకా పనులు పూర్తి చేసింది. ప్రస్తుతం కృష్ణా జలాలు బైరెడ్డిపల్లె మండలంలోని మిట్టపల్లెకు చేరుకున్నట్టు హంద్రీ–నీవా ఎస్ఈ సీఆర్ రాజగోపాల్, ఈఈ డి.రమేష్‌బాబు తెలిపారు.

చంద్రబాబు చేసిన దగా ఇలా..

ఉమ్మడి జిల్లాలోని మదనపల్లెకు 2019లో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు వచ్చారు. అదే ఏడాది డిసెంబరు నాటికి హంద్రీ–నీవా కాలువ ద్వారా పలమనేరు, కుప్పానికి నీరందిస్తామని హామీ ఇచ్చారు. అప్పటికే 2014 నుంచి ఏటా డిసెంబర్‌కు నీళ్లిస్తామంటూ జనాన్ని నమ్మిస్తూనే వచ్చారు. అయితే 2019 ఎన్నికలు సమీపిస్తుండడంతో హంద్రీ–నీవా కాలువలకు దగ్గర్లోని చెక్‌డ్యామ్‌ల నుంచి బోర్ల ద్వారా నీటిని కాలువలోకి పంపింగ్ చేసి పలమనేరు దాకా తరలించారు. ఆ నీటికే జలహారతి పేరిట అట్టహాసంగా పూజలు చేసి కుప్పం వాసులకు కుచ్చుటోపీ పెట్టారు. కేవలం నాలుగురోజులకే కాలువలో నీరు కనిపించకపోవడంతో జనం నోరెళ్లబెట్టారు. ఇదెక్కడ మోసమంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ఇచ్చిన మాట మేరకు..

గత ఏడాది కుప్పం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2023 డిసెంబరు నాటికి హంద్రీ–నీవా కాలువ ద్వారా పలమనేరు, కుప్పానికి నీరందిస్తామంటూ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు హంద్రీ–నీవాలో ఇప్పుడు కృష్ణమ్మ పరవళ్లుతొక్కుతోంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు సంబరపడుతున్నారు. తమ పాలిట అపర భగీరథుడంటూ కొనియాడుతున్నారు.



పశుపత్తూరు పంప్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన భారీ మోటార్లు



బైరెడ్డిపల్లి మండలంలో మిట్టపల్లె వద్ద ఉప కాలువలో జలాలు



పశుపత్తూరు పంప్‌హౌస్ వద్ద నీరు

నీటి కొరత తీరినట్టే



హంద్రీ–నీవా కాలువలో నీరు రావడంతో తాగు, సాగు నీటి కొరత తీరినట్టే. గతంలో బోర్లు వేసిన రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. వ్యవసాయం చేయడానికి సాహసం చేయలేక పొట్టకూటి కోసం వలసలు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువతో మళ్లీ వ్యవసాయం మొదలుపెడతా

– రెడ్డెప్పరెడ్డి, రైతు, పసపత్తూరు, గంగవరం మండలం

వడివడిగా కుప్పానికి!

బైరెడ్డిపల్లి మండలంలోని తీర్థం, తోటకనుమ, కృష్ణాపురం, రామకుప్పం మండలాల మీదుగా కృష్ణా జలాలు వడివడిగా ప్రవహిస్తున్నాయి. మరో ఇరవై రోజుల్లో కుప్పం నియోజకవర్గంలోని పరమసముద్రం చెరువుకు చేరుకోనునున్నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడిస్తున్నారు. హంద్రీ–నీవా జలాల రాకతో పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో సాగు, తాగునీటికి ఇబ్బందులు తప్పనున్నాయి. పెద్దపంజాణి, గంగవరం, బైరెడ్డిపల్లె, వి.కోట, రామకుప్పం, శాంతిపురం, గుడిపల్లె, కుప్పం మండలాల్లోని 6300 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు 0.5 టీఎంసీల సాగునీరు, 4.02 లక్షల మందికి 0.6టీఎంసీల తాగునీరు అందనుంది.

నాలుగు మోటార్లతో..

హంద్రీ–నీవా పథకంలో భాగంగా గంగవరం మండలంలోని పశపత్తూరు, వి.కోట మండలంలోని కృష్ణాపురం, రామకుప్పం మండలంలోని ఆదినేపల్లి వద్ద పంప్‌హౌస్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పశపత్తూరు వద్ద 750 కిలోవాట్స్ సామర్థ్యంగల నాలుగు మోటార్లతో నీటిని పైప్రాంతంలోని కాలువకు పంపింగ్ చేస్తున్నారు. ఇందుకోసం గంటకు 5,400 క్యూసెక్‌మీటర్ల నీటిని పంపే 5వేల కేవీ మోటార్లను అమర్చారు. అలాగే నీరు వేగంగా వెళ్లేందుకు భారీ కంప్రెషర్లు ఏర్పాటు చేశారు.



పైపుల ద్వారా వస్తున్న నీరు

వృత్తి నైపుణ్యంతోనే ఉన్నత స్థాయికి



ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేసి విద్యార్థులకు తినిపిస్తున్న మంత్రి రోజా

- ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో మంత్రి ఆర్కే రోజా

తిరుపతి సిటీ: మనం చేస్తున్న వృత్తిలో మంచి నైపుణ్యం సంపాదిస్తే ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశాలు ఉంటాయని రాష్ట్ర క్రీడల, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జూపార్క్ సమీపంలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఏర్పాటు చేసిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రసంగించారు. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. ఎంతటి పెద్ద వారైనా ఫైవ్‌స్టార్ హోటళ్లలో ఉద్యోగుల ఆతిథ్యాన్ని స్వీకరించాల్సిందేనన్నారు. ఈ కళాశాలలో శిక్షణ పొందిన విద్యార్థులకు స్థానికంగా ఉన్న తాజ్, మానస సరోవర్, గ్రాండ్ రిడ్జ్, బీమాస్, బ్లిస్ తదితర స్టార్ హోటళ్లతో ఒప్పందం కుదుర్చుకోవచ్చన్నారు. కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్ బీఎస్సీ డిగ్రీతో పాటు, డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. కళాశాలకు కావాల్సిన మౌలిక సదుపాయాల విషయంలో తమ వంతు సహకారం ఉంటుందన్నారు. అనంతరం కళాశాల ఆవరణ ఏర్పాటు చేసిన క్రీస్తు పాకను సందర్శించారు. క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. కళాశాల ప్రిన్సిపల్ రమణప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, మినర్వ గ్రాండ్ రీజినల్ మేనేజర్ మ్యాథ్యూ, త్రిలోకచందర్, కౌటిళ్య అకాడమీ శ్రీధర్ పాల్గొన్నారు.

బాలాజీ కిరణ్‌కు విశిష్ట పురస్కారం



విశిష్ట రైల్ సేవా పురస్కారాన్ని అందుకుంటున్న బాలాజీ కిరణ్

తిరుపతి(అలిపిరి): సికింద్రాబాద్ రైల్వేలో సీనియర్ డీసీఎంగా పనిచేస్తున్న సీనియర్ ఐఆర్‌టీఎస్ అధికారి వై.బాలాజీ కిరణ్ విశిష్ట రైల్ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ చేతుల మీదుగా ఈ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. ఈయన గతంలో గుంతకల్ డివిజన్‌లో సీనియర్ డివిజనల్ ఆపరేషన్ మేనేజర్‌గా విశేష సేవలందించినందుకుగాను 2022–23 ఆర్థిక సంవత్సరానికి పురస్కారాన్ని అందించారు. గుంతకల్ డివిజన్‌లో ఎన్నడూ లేని విధంగా అత్యధిక లోడింగ్, రెవెన్యూ రియలైజేషన్, గుత్తి, ధర్మవరం, తిరుచానూరు రైల్వే స్టేషన్ల నిర్మాణం, తిరుపతి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో బాలాజీ కిరణ్ ప్రముఖ పాత్ర పోషించారు. 2013లో యూపీఎస్సీ బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం సికింద్రాబాద్‌లో సీనియర్ డీసీఎంగా పనిచేస్తున్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

భాకరాపేట: తిరుపతి–పీలేరు జాతీయ రహదారి మార్గంలో ప్రమాదం తృటిలో తప్పింది. స్థానికుల కథనం.. శుక్రవారం వేకువ జామున హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న కారు చిన్నగొట్టిగల్లు చెరువు కట్టమీద పొగమంచు కారణంగా అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. కారు నీటిలో మునిగిపోతుండగా అందులో ఉన్న హైదరాబాద్‌కు చెందిన బాలసుబ్రమణ్యం (44), గోవిందన్ (50) ఈతకొట్టుకుంటూ బయటపడ్డారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యం



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- స్పోర్ట్స్ మీట్ బహుమతుల ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధన లక్ష్యంగా క్రీడలను ప్రోత్సహిస్తున్నారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కొనియాడారు. రేణిగుంట విమానాశ్రయ సమీపంలో ఉన్న ఏపీ గిరిజన గురుకుల రెసిడెన్షియల్‌విద్యాలయం(బాలురు)లో శుక్రవారం రాయలసీమ జిల్లాల జోన్–4 స్పోర్ట్స్ మీట్‌లో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ స్పోర్ట్స్ మీట్‌కు ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని గిరిజన గురుకుల విద్యాలయాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ డా.ఆర్.రవికాంత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను చిన్నతనంతో క్రీడలపై ఎంతో మక్కువగా ఉండేవాడినన్నారు. చదువులతోపాటు క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగులు వస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తోందని, రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసాన్ని పెంపొందించుకోవాలనే లక్ష్యంలో 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో ఆటలపోటీలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ప్రపంచంలో ఎక్కడా లేని సేవాకార్యక్రమాలను తాను సొంత నిధులతో అమలు చేస్తున్నట్లు వివరించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

రేణిగుంట గిరిజన గురుకులం విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. విద్యారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కార్యక్రమాలు భవిష్యత్‌లో నాణ్యమైన భావిపౌరులను తీర్చిదిద్దడంలో ప్రముఖ పాత్ర పోషించబోతున్నట్లు తెలిపారు. రేణిగుంట జెడ్పీటీసీ సంధ్యారాణి, సింగిల్ విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, మన్యం శ్రీనివాసులురెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, ఎంఈఓ ఇందిరాదేవి, ఎంఈవో–2 రంగనాథ్, ఈవోపీఆర్‌డీ వెంకటరత్నమ్మ, ప్రిన్సిపల్ ఆర్.రవికాంత్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, ఎంపీటీసీలు భాస్కరయ్య, ఆనందరావు, సర్పంచులు నగేషం, రహీం, శ్రీను, వేణు, జాన్ బాబు, హసన్, ఖదీర్ పాల్గొన్నారు.

తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలకు విద్యాసామగ్రి వితరణ

సత్యవేడు: తిరుపతిలోని ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలకు రూ. 10 లక్షలు విలువ చేసే విద్యా సామగ్రిని శ్రీసిటీలోని ఇండియా మెటర్ వన్‌స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్(ఐఎంటీపీ) ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ శుక్రవారం విరాళమిచ్చింది. స్టీల్– సంబంధిత వస్తు పరీక్షలకు అవసరమైన యూనివర్సల్ టెస్టింగ్ మెషిన్(యూటీఎం)తో పాటు ఆటోక్యాడ్ డిజైనింగ్ కోర్సు సులభతర అభ్యాసనకు మూడు క్లాస్ రూమ్‌లకు ఎల్సీడీ ప్రొజెక్టర్, సీతయూ ఇతర డిజిటల్ పరికరాలను వితరణ చేసింది. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఐఎంటీపీ మేనేజింగ్ డైరెక్టర్ తమోజో ఇవామి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించేందుకు తమవంతు సహకారం అందించినట్టు తెలిపారు. యువత సాధికారత, ఈ ప్రాంత అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. గత నాలుగేళ్లలో శ్రీసిటీ పరిసరాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు తరగతి గదులు, ఫర్నీచర్, కంప్యూటర్లు, పారిశ్రామిక వాడ కోసం అంబులెన్స్‌లు ఏర్పాటుకు సీఎస్ఆర్ కింద సుమారు రూ.కోటి వెచ్చించినట్లు తెలిపారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఐఎంటీపీ యాజమాన్యాన్ని అభినందించారు. విద్యపై వారికున్న నిబద్ధతను కొనియాడారు. విరాళం అందజేసినందుకు ఐఎంటీపీ యాజమానికి ఎస్వీ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ వై.ద్వారకానాథరెడి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు తమ నైపుణ్యాలు, జ్ఞానాన్ని మెరుగుపరుచుకోవడానికి యూటీఎం, డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఐఎంటీపీ ప్రతినిధులు రాజీవ్, సుప్రియ, రాజేష్ శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్, పాలిటెక్నిక్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ టీవీ రమణప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యూని వర్సల్ టెస్టింగ్ మెషిన్‌ను ప్రారంభిస్తున్న ఐఎంటీపీ ఎండీ తయోజో ఇవామి